క్లుప్తంగా

సీసీ రోడ్లు నిర్మించాలి

ములుగు రూరల్ : మండలంలోని భూపాల్‌నగర్‌లో వర్షాకాలం సందర్భంగా రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి జన్ను దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. భూపాల్‌నగర్‌లో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు నిధులు కేటాయించాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ములుగు రూరల్ : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని కాశిందేవిపేటలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు.. కాశిందేవిపేటకు చెందిన మామిడి అనిల్ (32) కుటుంబ కలహాలతో గురువారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


కాటారం : మద్యానికి బానిసైన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అంకుషాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఇనుగాల భాస్కర్ (33) అతిగా తాగుతూ మద్యానికి బానిసయ్యాడు. సమయానికి తినకపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురై పలుమార్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికీ మార్పు రాలేదు. కాగా భాస్కర్ శనివారం ఉదయం మద్యం తాగి వచ్చి తల్లి సమ్మక్కతో భోజనం విషయంలో గొడవపడి కొట్టడానికి రావడంతో తల్లి భయంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. దీంతో మద్యం మత్తులో క్షణికావేశానికి గురైన భాస్కర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి తల్లి సమ్మక్కకు సమాచారం అందించడంతో ఇంటికి వచ్చి చూసే సరికి భాస్కర్ కొన ఊపిరితో ఉన్నాడు. చుట్టు పక్కల వారు భాస్కర్‌ను కిందికి దించి చికిత్సకు తరలించే లోపు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

సన్మానం



చిట్యాల : ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గిన్నారపు ఆదినారాయణకు కోల్‌కత్తాలోని భారతీయ భాషా పరిషత్, భారతీయ భాషా సమ్మాన్ యువ పురస్కారం-2025 అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా శనివారం అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. అలాగే తెలుగు భాషా పరిశోధన, సృజనాత్మక సాహిత్య రంగంలో కృషి చేసినందుకు గాను పురస్కారంతో పాటు ప్రశంస పత్రం, శాలువాతో సత్కరించారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, అంబేడ్కర్ వాదులు గుర్రపు రాజేందర్, గోల్కొండ సురేష్, పుల్ల అశోక్, వెల్పుల రాజ్‌కుమార్, భిక్షపతి, నరేష్, తిరుపతి, కిరణ్, రమేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రేగొండ : మండల కేంద్రానికి చెందిన మైస భద్రయ్య శనివారం మృతిచెందాడు. దీంతో 1982 బ్యాచ్‌కు చెందిన పోలీసులు భద్రయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. నారాయణ రెడ్డి, భిక్షపతి, సురేందర్, లక్ష్మీనారాయణ, రఫాయిల్, కుమారస్వామి, జయరాజు పాల్గొన్నారు.

నిర్మించి వదిలేశారు

నిరుపయోగంగా వైద్యుల విశ్రాంతి భవనం

- పట్టించుకోని అధికారులు, పాలకులు



మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న వైద్యుల విశ్రాంతి భవనం

కన్నాయిగూడెం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యుల విశ్రాంతి కోసం నిర్మించిన భవన సముదాయం నిరుపయోగంగా మారింది. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనం ప్రారంభించకుండానే వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకు దృష్టిసారించడం లేదు. దీంతో వైద్యులకు సరైన వసతిలేక సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని రోగులకు అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులోకి రాలేకపోతున్నారు. రాత్రివేళ స్టాఫ్‌నర్సులే వైద్యం చేయాల్సిన పరిస్థితి ఉంది. గతేడాదిలోనే వైద్యుల సముదాయ భవనం పూర్తయిన భవనాన్ని ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి వైద్యుల విశ్రాంతి భవనాన్ని ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

ప్రజాధనం వృథా..

మండలంలోని పీహెచ్‌సీ ఆవరణలో వైద్యుల విశ్రాంతి కోసం గత ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి భవనాన్ని నిర్మించింది. వైద్యులు 24 గంటల పాటు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో భవనం నిర్మాణం చేపట్టారు.

ఎమర్జెన్సీలో హెడ్ నర్సులే దిక్కు..

రాత్రివేళలో అత్యవసర సమయంలో హెడ్ నర్సులే వైద్యం అందిస్తున్నారు. వైద్యులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అత్యవసరమైతే అందుబాటులోకి డాక్టర్లు వస్తూ వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం సీహెచ్‌సీకి, ఏరియా ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఇటీవల బుట్టాయిగూడెంకు చెందిన మహిళ పురిటినొప్పులతో డెలివరి కోసం రావడంతో అందుబాటులో ఉన్న వైద్యసిబ్బంది నార్మల్ ప్రసవం చేశారు. అనంతరం వైద్యులు వచ్చి తల్లిబిడ్డకు ఆరోగ్య పరీక్షలు చేసి డిశ్చార్జ్ చేశారు.

‘ఇళ్ల పంపిణీలో ఆరోపణలు సరికాదు’



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి : ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతోపాటు ఐటీడీఏ ద్వారా అదనంగా 1,500 ఇళ్లను పంపిణీ చేసిన ఘనత మంత్రి సీతక్కకే దక్కుతుందన్నారు. సీతక్క కీర్తిని, పేరును ఓర్వలేని నాయకులు కుటీల రాజకీయాలు చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు లేదన్న సోయి ఆ పార్టీ నాయకులకు ఎందుకు లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మంత్రి సీతక్కపై, పార్టీపై ఉన్న అక్కసుతో కావాలని ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మేడారం జాతర మాజీ చైర్మన్ లచ్చుపటేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజఫర్ హుసేన్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు జగదీశ్, బండారి చంద్రయ్య, జయపాల్‌రెడ్డి, గొని మధు పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతు చేయండి



చేతిపంపును పరిశీలిస్తున్న చిరంజీవి

ఎస్ఎస్‌తాడ్వాయి : జలగలంచ గొత్తికోయగూడెం సమీపంలోని జాతీయ రహదారి పక్కన బస్టాండ్ వద్ద ఉన్న చేతిపంపునకు మరమ్మతు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి అధికారులను కోరారు. సోమవారం స్థానికులతో కలిసి ఆయన చేతిపంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిపంపు పనిచేయక నెలరోజులు గడుస్తున్న అధికారులు మరమ్మతులు చేయడం లేదన్నారు. తాగునీటి కోసం గూడెంలోని గొత్తికోయలతోపాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చేతిపంపును మరమ్మతు చేయాలని కోరారు.

విద్యార్థుల నమోదుకు కృషిచేయాలి



వాజేడు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



ఏటూరునాగారం: ఆకులవారిఘణపురంలో..

వాజేడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని వాజేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని కాచారం, జంగాలపల్లి, జగన్నాథపురం, కొప్పుసూరు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేస్తు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూప్ సింగ్, మల్లయ్య, వెంకటరమణి, ఆనంద్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజేష్, శ్రీరంగం, రాజ్యలక్ష్మి ఉన్నారు.

బెస్తగూడెం గ్రామంలో బడిబాట..

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో యూపీఎస్ ఉపాధ్యాయులు శనివారం బడిబాట నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పలత, కృష్ణారావు, ఉషారాణి, సురేష్, రమణ, రాజు, రవి, కళ్యాణి, గ్రామస్తులు ఉన్నారు.



ఏటూరునాగారం: బడిబాటలో భాగంగా ప్రచారం చేస్తున్న శ్రీనివాస్, ఉపాధ్యాయులు

బడిలో చేర్పించి భవిష్యత్ మార్చుకోండి

ఏటూరునాగారం : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి భవిష్యత్ మార్చుకోవాలని మనం సోషల్ వెల్ఫేర్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలున్నాయని, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యాబోధన జరుగుతుందని తల్లిదండ్రులను కోరారు. ప్రాథమిక విద్య, ప్రధాన విద్య అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆకులవారిఘణపురం ప్రధానోపాధ్యాయుడు సారంగం, రాజు, రాములు, వాణిశ్రీ, కృష్ణమూర్తి, సారయ్య, నరేష్, అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, యూత్ సభ్యులు, మైపతి శ్రీను, గడ్డం సతీష్ పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): బెస్తగూడెంలో..

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ఎస్ఎస్‌తాడ్వాయి : మంత్రి సీతక్క ఆదేశాలతో రాహుల్ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న (సోమవారం) మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తారని అన్నారు. పరీక్షలు చేయించుకునే వారు ఆధార్, ఓటర్, రేషన్ కార్డు జిరాక్స్‌లతోపాటు ఫోన్ నంబర్ తీసుకుని రావాలన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుస్తులు, పుస్తకాల పంపిణీ



వాజేడు : విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న దుస్తులు, పుస్తకాలను ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం అంజేశారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు వాటిని ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు 75 శాతం మేర పాఠశాలలకు పుస్తకాలు, దుస్తులు చేరిపట్లు ఎంఈఓ వివరించారు.

‘జర్నలిస్టులను విస్మరిస్తున్న పాలకులు’



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రం స్వామి

మంగపేట : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న అసంఘటిత కార్మికులైన జర్నలిస్టులను ప్రభుత్వాలు, పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారని సీనియర్ జర్నలిస్టుల సంఘం గౌరవ అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు ధర్మపురి శ్రీనివాస్, ఎర్రం స్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పాత్రికేయుల సమస్యలపై అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామి మాట్లాడారు. ప్రభుత్వాలు అధికారంలోకి రావడానికి, పాలకులు వారి పదవులకు విలేకరులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప సమాజహితం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 25ఏళ్ల నుంచి ఇంటి స్థలాలకోసం పాలక ప్రభుత్వాల ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టు తిరుగుతూ వినతిపత్రాలు అందజేసినా హామీలు తప్ప ఆచరణలో చూపిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పాత్రికేయులందరికి ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి నేడు మొండిచేయి చూపిందని విమర్శించారు. మంత్రి సీతక్క మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు పలుమార్లు ఇంటి స్థలాల విషయంపై మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామానికి నాలుగో స్తంభం అని పిలవబడే విలేకరులకు ప్రభుత్వాలు, పాలకులు ఇచ్చే గుర్తింపు ఇదేనా అన్ని ప్రశ్నించారు. జర్నలిస్టుల సేవలను వినియోగించుకుంటూ వారిని విస్మరిస్తున్న రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధుల మాటలను ఇకపై నమ్మబోయేది లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇంటిస్థలాలు, ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తక్షణం అందేలా ప్రభుత్వం, పాలకులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ శ్రీనివాస్, సభ్యులు కల్లెబోయిన శ్రీనివాస్, మఠం రమేష్, కురిమిళ్ల శ్యామ్, నల్లూరు మాధవ్, వడ్లకొండ వీరయ్య, పల్లాపు రమేష్, ఇప్పాల నరేష్, ఈసంపెల్లి సురేందర్, పొలసాని శ్రీనివాస్‌రెడ్డి, ఉగ్గుమళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ములుగు రూరల్: సాయం అందజేస్తున్న బాధ్యులు



వాజేడు: నగదు అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన జర్నలిస్టు కుంచం రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తోటి జర్నలిస్టులు బాధిత కుటుంబానికి చేయూతనందించారు. శనివారం వారి కుటుంబానికి రూ.35,500ల నగదు అందజేశారు. యూనియన్ నాయకుడు మహ్మద్ షఫీ, నాయకులు బేతి సతీష్, జంగిలి కోటేశ్వర్, దూడబోయిన రాకేష్, గాదం దేవేందర్, సుంకరి సంపత్, రాంమూర్తి, గుడ్ల రాజు, మాట్ల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

వాజేడు : మండల పరిధిలోని ఏడ్జెరపల్లి గ్రామానికి చెందిన బట్ట రజిత కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందింది. కాగా శనివారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున భద్రాచలం సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు, కాకర్లపూడి సాయికళ్యాణ్ రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అంకెనబోయిన నర్సింహారావు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ ఆఫీస్‌లో ‘బీర్’ కలకలం!

- నిజాలు తెలియకుండా ఆరోపణలు చేయడం సరికాదు: తహసీల్దార్ సర్వర్



సిబ్బందికి బ్రీత్‌ఎనలైజర్ టెస్ట్ చేస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) టేబుల్‌పై ఉన్న బీర్ కాటన్

కన్నాయిగూడెం : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీర్ కాటన్ ఉందంటూ మండలంలోని స్థానిక విలేకరులు రెవెన్యూ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. శనివారం బక్రీద్ రోజు రెవెన్యూ అధికారులు కార్యాలయంలోకి బీర్లు తెచ్చుకొని తాగారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై తహసీల్దార్ సర్వర్‌ను వివరణ కోరగా భూభారతి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నందున సెలవు ఉన్నప్పటికీ సిబ్బందిని విధులు నిర్వహించాలంటు ఆదేశాలు ఇచ్చామని అందులో భాగంగా మధ్యాహ్నం భోజనం కోసం మండలంలోని హోటల్ నుంచి భోజనం పార్సిల్ తీసుకొచ్చామని తెలిపారు. భోజనం తెచ్చిన కాటన్ చూసి మండలంలోని రిపోర్టర్లు కార్యాలయానికి వచ్చి ఫొటోలు తీశారని వివరించారు. కార్యాలయంపై వచ్చిన ఆరోపణలను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బ్రీత్‌ఎనలైజర్ పరీక్షలు చేయించడం జరిగిందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన విలేకరులపై రెవెన్యూ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

వెంకటాపురం(కె): నమాజ్ చేస్తున్న ముస్లింలు



వాజేడు: ప్రార్థన చేస్తున్న ముస్లింలు



ఘనంగా బక్రీద్



ఏటూరునాగారం: అలయ్‌బలయ్ చేసుకుంటున్న ముస్లింలు

వాజేడు : మండల వ్యాప్తంగా ముస్లింలు శనివారం బక్రీద్ వేడుకను జరుపుకున్నారు. పేరూరు గ్రామంలోని ఈద్గాలో ముస్లింలు నమాజ్ చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె) : మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్ హుసేన్, తాజొద్దీన్, హమీద్ తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం : మండలంలోని ముస్లింలు బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నబోయినపల్లిలో బక్రీద్ పండుగను ముస్లింలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్‌పాషా, మజీద్ పెద్దలు వలిబాబా, అజ్మత్‌ఖాన్, అక్తర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం : మండలంలో ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ముప్పనపల్లి, కన్నాయిగూడెం, లక్ష్మీపురం, గూర్రేవుల గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలో అలయ్‌బలయ్ తీసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రియాజుద్దీన్, షాయక్ పాషా, ముయినొద్దిన్, ఇబ్రహీంతో పాటు తదితరులు పాల్గొన్నారు



ఏటూరునాగారం: ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



కన్నాయిగూడెం: ముప్పనపల్లిలో..

శిలాఫలకాల ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం

భూపాలపల్లి రూరల్ : ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అభివృద్ధిని అడ్డుకోలేరని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండిపడ్డారు. శనివారం రేగొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని, ఓర్వలేకనే భూపాలపల్లి మండలంలోని నాగారం, మోరంచపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల శిలాఫలకాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధ్వంసం చేశారని ఇది హేయమైన చర్య అని ఖండించారు. దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పోలీసులను కోరారు.

అభివృద్ధిని ఓర్వలేకనే..

నియోజక వర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే శిలాఫలకాలను ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు చాడ రఘునాథరెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో మోరంచపల్లిలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు



బొడ్రాయి, గ్రామదేవతల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మంగపేట: మండలంలోని చెరుపల్లిలో ఈనెల 5నుంచి ప్రారంభమైన బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపన మహోత్సవ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మూడోరోజు ప్రతిష్ఠాపనాచార్యులు చిట్టోజు రామాచారి, గాదె నరేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయంనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సామూహిక అష్టలక్ష్మి హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి బొడ్రాయి, గ్రామదేవతామూర్తుల పంచామృతాల అభిషేకం, గ్రామోత్సవం(ఊరేగింపు) కార్యక్రమంలో భాగంగా ధాన్యదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి 11గంటల వరకు బొడ్రాయి, గ్రామదేవతామూర్తులను డప్పుచప్పుళ్లతో పోతురాజుల విన్యాసాలతో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉదయం బొడ్రాయి (నాభిశిల), గ్రామ దేవతల జీవయంత్ర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతిష్ఠాపనాచార్యులు తెలిపారు.